క్లుప్తంగా

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు



కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు

రాజాం సిటీ: స్థానిక హరిజన వీధిలో కుక్కలు స్వైరవిహారం చేసి ఇద్దరు చిన్నారులను గాయపర్చాయి. శనివారం ఉదయం వీధిలో ఆడుకుంటున్న వివేక్, అజయ్‌లపై ఒక్కసారిగా దాడి చేయడంతో గాయాల పాలయ్యారు. వెంటనే స్థానికులు గమనించి కుక్కలను చెదరగొట్టి చిన్నారులను రాజాం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స నందించారు. పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉండడంతో పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



ఫ్యాక్టరీలో చెలరేగిన మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రేగిడి: మండలంలోని చినలింగాలవలస గ్రామ సమీపంలోని పామాయిల్ ఫ్యాక్టరీలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. కర్మాగారంలోని ఆయిల్ ట్యాంకుల్లో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బంది రాజాం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, హుటాహుటిన అక్కడికి చేరుకున్న వారు మంటలను అదుపు చేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తెర్లాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త వై.శ్రీదేవి తెలిపారు. శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5 పరిధిలోని గర్భిణుల ఇంటింటికీ వెళ్లిన ఆమె వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేయించుకోవాలని సూచించారు.

వంగర: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని కోనంగిపాడు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ కల్యాణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని 5, 6 వార్డుల్లో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు.

వైకుంఠరావుకు డాక్టరేట్

రాజాం సిటీ: మండలంలోని మొగిలివలస గ్రామానికి చెందిన బూరాడ వైకుంఠరావు డాక్టరేట్ పట్టాను ఆంధ్రా యూనివర్సిటీ వీసీ పి.వి.జి.వి.ప్రసాద్ రెడ్డి చేతులమీదుగా శనివారం అందుకున్నారు. రాజనీతి శాస్త్రం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో 'లోకల్ గవర్నెన్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ వచ్చిందని, ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

పర్యావరణ హితమే లక్ష్యం

పర్యావరణ హితమే లక్ష్యంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ అన్నిచోట్ల జరుగుతోంది. ఈ నెల 18వ తేదీన వినాయక చవితి ఉత్సవాలు మొదలుకానున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించేలా అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పర్యావరణానికి మంచిది కాదని, మట్టి విగ్రహాలనే వాడాలని కోరుతున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మట్టి ప్రతిమల పంపిణీ



రామభద్రపురం: మట్టి వినాయక విగ్రహాలతో విద్యార్థులు

ప్రభుత్వం పేదల పక్షపాతి

- బొద్దాంలో రూ. 1.32 కోట్ల వ్యయంతో జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు

రాజాం: పేదల పక్షపాతి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని, పేదలకు ఇళ్లు ఇస్తామన్నా, పథకాలు ఇస్తామన్నా టీడీపీ, ఎల్లోమీడియా అడ్డుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశాయని అయినా ప్రభుత్వం ఏనాడూ ఏ ఒక్క పథకం ఆపలేదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని బొద్దాం గ్రామంలో రూ.1.32 కోట్ల వ్యయంతో జల్‌జీవన్ మిషన్ పనులను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ నవరత్నాలు పేరిట పథకాల రూపంలో అమలుచేస్తున్నారన్నారు. ఓ వైపు సంక్షేమాన్ని, మరోవైపు అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో రాజాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. వైఎస్సార్ సీపీ సర్కారు వచ్చిన తర్వాత రాజాం ప్రధాన రోడ్డు విస్తరణ జరిగిందని, ఉల్లివలస నుంచి సంకిలి వరకు కొత్తగా డబుల్ రోడ్డు నిర్మాణం చేపడుతోందన్నారు. ఈ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

జలజీవన్ మిషన్ ద్వారా రాజాం నియోజకవర్గానికి రూ.118 కోట్లు మంజూరు చేశామని, టీటీడీ నుంచి పార్టీ రీజనల్ ఇన్‌చార్జ్ వై.వి.సుబ్బారెడ్డి సాయంతో బొద్దాం గ్రామంలో రామమందిరం నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు చేశామన్నారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో ఈ గ్రామంలో 1200 ఇళ్లకు సంక్రాంతి పండగకు ముందుగానే ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి, మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా ప్రారంభిస్తామన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో లేనిపోని హామీలతో మళ్లీ ప్రజలను బురిడీ కొట్టించేందుకు చంద్రబాబు అండ్ కో సిద్ధమైందని, వారి మాటలను నమ్మవద్దన్నారు. నలభై ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ, నీతిమంతుడును, సత్యవంతుడును అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు స్కిల్ కుంభకోణంలో చిక్కుకుని, జైలుపాలయ్యారని, ఇదే ఆయన అవినీతి పాలనకు నిదర్శమన్నారు. చంద్రబాబు జైలుకు వెళ్తే ఆయన సొంత పుత్రుడు లోకేష్ కన్నా దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ఎక్కువ హడావిడి చేశారని ఇదే ఆయన ఆ పార్టీకి అమ్ముడుపోయాడన్న దానికి ఉదాహరణన్నారు.

టీడీపీ చేసిందేమీ లేదు..

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ ఒక్కరికి అండగా నిలిచారని, పార్టీలతో సంబంధం లేకుండా పెద్దఎత్తున నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందించడం అంత ఆషామాషీకాదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ ఓట్లు కోసం గడప తొక్కే టీడీపీ నాయకులను నమ్మవద్దన్నారు. వారి మాటలు విని, వారికి ఓటు వేస్తే రాష్ట్రాన్ని దోచుకుంటారన్నారు. గతంలో అధికారంలోకి వచ్చినప్పుడు టీడీపీ ప్రజలకు ఏం చేసిందని ప్రశ్నించారు. అంతకుముందు ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న వైఎస్సార్ సీపీనే వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.సులోచన, సర్పంచ్ ఎస్.తవిటమ్మ, వైస్ ఎంపీపీ ఎస్.వర్షిణి, ఎస్.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, పార్టీ నేతలు టి.రాజేష్, ఎల్.రాజగోపాలనాయుడు, పి.శ్రీనివాసరావు, వి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా సంక్షేమ పథకాల అమలు



బొబ్బిలి: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రేగిడి: ప్రభుత్వ సంక్షేమ పాలననను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ఎన్ని అవాంతరాలు సృష్టిస్తున్నా ప్రజలకు నిరంతరాయంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని శివడవలస గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతీ పేదవాడు దర్జాగా బతకాలనే ఆలోచనతో వారి అవసరాలు తీరేలా అర్హులందరి బ్యాంకు ఖాతాలో సంక్షేమ పథకాల నగదు నేరుగా జమ చేస్తున్నారని తెలిపారు. గతంలో టీడీపీ హయాంలో ఆ పార్టీ వారికే పథకాలు అందేవన్నారు. ఇప్పుడు అలా కాదని, అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలోని పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇవే పథకాలను అడ్డుకునేందుకు టీడీపీ నేతలు ఎన్నో ప్రయత్నాలు చేశారని, అయినా సీఎం జగనన్న వాటిని అనుకున్న సమయానికి ఖచ్చితంగా అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, సర్పంచ్ లక్ష్మీరాణి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శనివారం మండలంలోని జోడుబందల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతీ హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, ప్రభుత్వ పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నిండుకున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతీ పంచాయతీ అభివృద్ధి చెందేలా సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటితో ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయన్నారు. టీడీపీ మాయమాటలను నమ్మితే రాష్ట్ర భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నిల్లోనూ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి. అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ కె.అప్పలనాయుడు, ఎంపీటీసీ కె.మన్మథరావు, రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు వి. అశోక్‌కుమార్, ఎంపీడీవో శ్యామలాదేవీ, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు

- ఎస్ఈబీ సీఐ జైభీమ్

రామభద్రపురం: సారా తయారు చేసినా, అమ్మినా(విక్రయించినా) కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి ఎస్ఈబీ(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ హెచ్చరించారు. ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కర్రిందొరవలస గ్రామంలో ప్రచారం రథం ద్వారా సారా నివారణపై శనివారం అవగాహన కల్పించారు. సారా తాగుడుకు ఎంతోమంది బానిసలై, తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎవరు సారా తయారు చేసినా, అమ్మినా తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామస్తులు కూడా సారా తయారీ, అమ్మకాలను అరికట్టడంలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్‌ఐ చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

- డీఎస్పీ పి.శ్రీధర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ పి.శ్రీధర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ తిరుమలరావుతో కలిసి శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.

ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక మండపాల వద్ద పెద్దపెద్ద లౌడ్‌స్పీకర్లు పెట్టి, ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దన్నారు. నిమజ్జనాలు చేసేటప్పుడు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. నిమజ్జనోత్సవంలో ఎటువంటి సంఘటనలు జరిగినా ఉత్సవ నిర్వాహకులదే బాధ్యతన్నారు. ఆర్అండ్‌బీ, పీఆర్ రోడ్లతో పోలిస్తే జాతీయ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, మత్తు పదార్థాలు తీసుకోవడంతో పాటు రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో రామభద్రపురం, బాడంగి ఎస్‌ఐలు సురేంద్రనాయుడు, జయంతి తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు 'ఓజోన్' కీలకం



రాజాం సిటీ: ఓజోన్ ఫార్ములా 'ఓ3' ఆకారంలో కంచరాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



రాజాం సిటీ: ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: సర్వమానవాళి మనుగడకు ఓజోన్ పొర చాలా కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వప్నహైందవి అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టణంలో వికాస తరంగిణి యువవికాస్-జీయర్ యూత్ క్లబ్ సభ్యులు అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించి, ఓజోన్ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణతోనే ఓజోన్ పొర కాపాడుకోగలమన్నారు. సంస్థ అధ్యక్షుడు టి.టి.వి.రమణమూర్తి మాట్లాడుతూ నేటి యువత పర్యావరణం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తే భవిష్యత్ తరాల మనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కె.సాయిప్రశాంత్‌కుమార్, పి.చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, కార్యక్రమంలో భాగంగా మండలంలోని కంచరాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓజోన్ ఫార్ములా(ఓ3) ఆకారంలో విద్యార్థులు కూర్చొని, ఆకట్టుకున్నారు.

వంగర: మండలంలోని అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఓజోన్ పొర సంరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

రాజాం: మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎం.మహేశ్వరరావు ఓజోన్, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



తెర్లాం: కూనాయవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, ఎంపీడీవో రామకృష్ణ



రామభద్రపురం సచివాయం-2లో వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రమామణి తదితరులు



రాజాం సిటీ: బుచ్చెంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

తెర్లాం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ సర్వేను పక్కాగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, చీపురుపల్లి డీఎల్‌డీవో వి.లక్ష్మణరావు సూచించారు. శనివారం మండలంలోని కూనాయవలస గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపీడీవో శంబంగి రామకృష్ణతో కలిసి పరిశీలించిన ఆయన ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ఏకైక లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో తెర్లాం పీహెచ్‌సీ సీహెచ్‌వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండల కేంద్రంలోని సచివాలయం-2లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వలంటీర్లకు శనివారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో రమామణి, తహసీల్దార్ రాజారావు మాట్లాడుతూ తొలుత వలంటీర్లు కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ఇంటింటికీ వెళ్లి, వివరించాలని, ఆ తర్వాత వైద్యారోగ్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి, రోగుల వివరాలు సేకరిస్తారని, ఆ తర్వాత జరిగే వైద్య శిబిరాల్లో వైద్యసేవలు, మందులు అందజేయడం జరుగుతుందన్నారు.

రాజాం సిటీ: మండలంలోని గురవాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ప్రతీ ఇంటికి మెరుగైన వైద్యం అందాలన్న సదుద్దేశ్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతోందని, కార్యక్రమ అమలు పక్కాగా జరిగేలా చూడాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటలో ప్రత్యేకాధికారి సుధాకర్ సర్వేను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రంజిత్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం బొండపల్లి గ్రామానికి చెందిన యువకుడు రెడ్డి రంజిత్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో చేపడుతున్న రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాల పనులను మరింత వేగవంతం చేయాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ లక్ష్మణరావు సూచించారు. గ్రామంలో జరుగుతున్న ఆయా భవన నిర్మాణ పనులను శనివారం పరిశీలించిన ఆయన రూ.40 లక్షల వ్యయంతో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వీటిని త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎం.ఎ.స్వామి ఉన్నారు.

సకాలంలో బిల్లుల చెల్లింపు..

రాజాం: జగనన్న కాలనీ గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. ఇదే విషయమై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమైన ఆయన నిర్మాణాలు చేస్తున్న వారికి సకాలంలో బిల్లుల చెల్లింపు, నిర్మాణ సామగ్రి ఇవ్వడం జరుగుతోందని, వీటిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ఎం.వి.నాగరాజు, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

వంగర: మండలంలోని మరువాడకు చెందిన ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.జనార్దనరావు శనివారం తెలిపారు. వివాహిత అమ్మమ్మ కె.బూర్ధమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశామని ఆయన అన్నారు.

సకాలంలో 'స్పందన' సమస్యల పరిష్కారం



అధికారులకు సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

తెర్లాం: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను సకాలంలో పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి, చీపురుపల్లి డీఎల్‌డీవో వి.లక్ష్మణరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని కోరారు. అలాగే మండలంలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు నిర్దేశిత కాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.